www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 5 మార్చి 2024

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాయచోటిలోని పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, పరీక్షల నిర్వహణ గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని, పరీక్షల ఇన్విజిలేటర్‌ను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్షల నిర్వహణ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి కృష్ణయ్య, ఇతర అధికారులున్నారు.

విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ముంపు బాధితులకు పూర్తి సహకారం : కలెక్టర్

ప్రజాశక్తి-ఓబులువారిపల్లి

మంగంపేట ముంపు బాధితులకు కేటాయించిన అర్అర్-5 లేఅవుట్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుందతివాడ, హరిజనవాడ ముంపు బాధితులకు కేటాయించిన ఆర్ఆర్-5, లే అవుట్‌ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగపేట ముంపు బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుందతివాడ, హరిజనవాడ గ్రామాలలో గ్రామస్తుల కోరిక మేరకు లేఅవుట్లో అన్ని మౌలిక వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ లేఅవుట్‌లో సిసి రోడ్లు, డ్రెయినేజీ, పాఠశాల భవనం, శ్మశానవాటిక, పార్క్ తదితర మౌలిక వసతులన్నీ లేఅవుట్‌లో కల్పిస్తామన్నారు. నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతి ఇంటికి కులాయి కనెక్షన్ ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడ జరిగే ప్రతి పని క్వాలిటీగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కాలనీలో విశాలమైన రోడ్లు, కిరువైపులా గ్రీనరీ ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మంగంపేట బెరైటీస్ గనులను పరిశీలించారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్‌డిఒ మోహన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి పాల్గొన్నారు.

ముంపు బాధితుల కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఈడిగపాలెం వార్డులో రూ.80లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడామల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. సంక్షేమ ప్రదాత, నిత్య కృషివలుడు అయిన జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాంబాబు, వైస్ చైర్మన్ మర్రిరవి, వార్డు కౌన్సిలర్లు, మునిసిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరమని ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. నారదాసుకి మణి రెండులక్షలు, వై.వెంకటరమణ రూ.1.60 లక్షలు, వై.జయమ్మ రూ.70 వేలు, వై.వెంకటరమణ, ఎన్.జయమ్మ రూ.70వేలు చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ ఆపత్కాలంలో సిఎం సహాయనిధి ప్రజలను ఆదుకొని అండగా నిలుస్తుందని అన్నారు. అనంతరం పత్యరాల శ్రీ త్రేతేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, జెఎసి కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి

హాస్టల్ విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వానికి పట్టదా? : ఎస్ఎఫ్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొమ్మిది గిరిజన సంక్షేమ హాస్టళ్ళలో 9,489 మంది విద్యార్థులు, 55 సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో 4127 మంది, 45 వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లలో 3893 మంది పేద విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. వారికి రావాల్సిన డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు నిలుపుదలకు నిధులను సంక్షేమ పథ కాలకు మళ్లించడమే కారణమా కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ హాస్టల్లో అందరూ గ్రామీణ పేద విద్యార్థులే చదువుకుంటున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వరుసగా బటన్ నొక్కుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రభుత్వ హాస్టల్లో ఉన్న పేద విద్యార్థుల సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు. నాలుగైదు నెలలుగా డైట్ బిల్లులు చెల్లించకపోతే మెనూ ప్రకారం విద్యార్థులకు వార్డెన్లు నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించడంతోనే హాస్టల్‌కు డైట్ బిల్లులు కూడా చెల్లించలేని దారుణ స్థితి నెలకొందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాజంపేట ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు లక్ష్మీనారాయణ, చెంగయ్య, సుమంత్, హరి, విష్ణు, విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఇవిఎం స్ట్రాంగ్ రూముల భద్రత : కలెక్టర్

ఉద్యానవన కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ఇవిఎం భద్రపరిచే స్ట్రాంగ్ రూముల భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం రైల్వేకోడూరు మండలం, అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేయబోయే ఇవిఎం స్ట్రాంగ్ రూములను, పుల్లంపేట మండలం ఎస్‌బివిడి సభ హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో విశాలమైన గదు లు ఉన్నాయని ఈ ప్రాంతంలో ఇవిఎంలు భద్రపరిచేందుకు అనుకూలంగా ఉందని అన్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి చిన్న పొరపాటు కూడా జరగ కుండా స్ట్రాంగ్ రూముల భద్రత మరింత జాగ్రత్తగా చూడాలన్నారు.ఇవిఎంలు భద్రపరిచిన తర్వాత కళాశాలలోకి ఇతరుల ప్రవేశం ఉండకూడదని స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత గురించి పోలీస్ అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.స్ట్రాంగ్ రూములకు వచ్చి వెళ్లే వారికి బార్ కెటింగ్ పకడ్బందీగా ఉండాలని అన్నారు. మండలంలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయి, ఎంతమంది ఓటర్లు ఉన్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లకు సంబ ంధించి ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధన ప్రకారం ప్రతి పోలింగ్ బూత్‌కు ర్యాంపు, విద్యుత్, టాయిలెట్లు, బెంచీలు తదితర వస్తు వులన్నీ ఉండేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మోహన్‌రావు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలరాణి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో బాధిత వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

దాడికి గురైన దంపతులకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లి : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, అయోధ్యనగర్‌లో భూ వివాదం విషయంలో దంపతులు వెంకట రమణారెడ్డి,లక్ష్మమ్మలపై కుమారుడు శ్రీనివాసులురెడ్డి అమానుషంగా దాడిచేయడం వలన గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిఐటియు నాయకులు తెలకపల్లి హరింద్రనాథ్ శర్మ కలిసి పరామర్శించారు. అనంతరం ఆర్ఎంఒను కలిసి బాధితులకు మెరుగైన చికిత్సలు అందివ్వాలని కోరారు. ఆర్ఎంఒ ప్రసాద్ రాజు బాధితులకు పూర్తి స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తామని చెప్పారు. తల్లిదండ్రులపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. తల్లిదండ్రులపై ఇలాంటి దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు భాగ్యమ్మ, షాహీన డిమాండ్ చేశారు.

'ఆదిత్య'లో ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి : స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఒంటిమిట్టపల్లెలో ఓటు హక్కు ఓటు వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఓటు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత రానున్న అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. సతీష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అరుణ్ కుమార్ రెడ్డి అధ్యాపకులు కె.మంజు, బాలాజీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో సమస్యలతో వచ్చిన అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెసితోపాటు డిఆర్ఒ సత్యనారాయణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తిచెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి

కట్టుదిట్టంగా 'పది' పరీక్షలు : డిఇఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 18 వ తేదీ నుంచి 30 తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా, పకడ్బందీగా చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్ట ణంలోని మాసాపేటలోని ఓ కల్యాణ మండపంలో పదవ తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పదవ తరగతికి ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఒక్కొక్కటి 50 మార్కులకు ఉంటాయని తెలిపారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వ హించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా విద్యార్థులందరూ స్వేచ్ఛగా, భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతి సెంటర్లోనూ ఫ్యాన్స్, లైట్లు, డెస్కులు ఉండేరకంగా చూడాలని తెలిపారు. తిరుపతి ఉప విద్యాశాఖాధికారి ఆనందరెడ్డి మాట్లాడుతూ ఈసారి పదవ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు సీరియల్ నెంబర్ కలిగి ఉంటాయని, ఏ విద్యార్థికి ఏ సీరియల్ నెంబరు వచ్చింది తెలుస్తుందన్నారు. ఏ పేపర్ అయినా బయటికి వస్తే ఆ పేపరు ఏ విద్యార్థికి చెందినదనే విషయం సుల భంగా తెలుసుకోవచ్చునన్నారు. పిల్లలు ప్రశ్నాపత్రాలు బయటకు పంప కుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మదనపల్లి ఉపవిద్య శాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలు ట్రాన్స్ పోర్ట్ సమ యంలో జాగ్రత్త వహించాలని, జవాబు పత్రాలు ప్యాకింగ్ సమ యంలోను జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. డిసిఇబి సెక్రటరీ నాగ ముని రెడ్డి మాట్లాడుతూ చీప్ సూపర్డెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ సమ యపా లన పాటిస్తూ ప్రభుత్వం వారి ఆదేశానుసారం విద్యార్థులకు సమ యానికి ప్రశ్నపత్రాలు చేరే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం ఎఎంఒ రామకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొత్తం పరీక్ష విధానంపై అందరికీ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎడి ప్రసాద్‌బాబు, చీఫ్‌సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యం

ప్రజాశక్తి-పీలేరు

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యంమని డాక్టర్ దేవులపల్లి మౌర్యరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్లో పీలేరు-టి.సుండుపల్లి, సోమల-కలకడ రూట్లలో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్లను లక్కీ డిప్ ద్వారా గుర్తించి వారికి శ్రీ మౌర్య కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి ఆకర్షణీయమైన బహుమతులను ప్రదానం చేశామని పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌర్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు మనందరి సంపదని, వాటిని కాపాడుకోవడం ప్రతి ప్రయా ణికుడి బాధ్యతని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించినప్పుడే మనుగడ, అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అనంతరం పీలేరు-టి.సుండుపల్లి మార్గంలో ప్రయాణం చేసిన సాయి ప్రసన్నకు ప్రథమ బహుమతి, కె. భాస్కర్ కు ద్వితీయ బహుమతి, ఎస్. సుధాకర్ కు తృతీయ బహుమతి అందజేశారు. అలాగే సోమల-కలకడ రూట్లో ప్రయాణం చేసిన జమ్రుద్దీన్ ప్రథమ బహుమతి, రెడ్డి ప్రభాకర్ ద్వితీయ బహుమతి, కె గౌతమి తృతీయ బహుమతిని డాక్టర్ మౌర్యా రెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేశారు.

ప్రయాణికులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్‌టిసి డిఎం

24న మదనపల్లెలో వాల్మీకి శంఖారావ సభ

మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకి, బోయల ఎస్టీ పునరు ద్ధరణ కోసం వాల్మీకి సంఘాలన్నీ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని వివిధ వాల్మీకి సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని రాగిమాను సర్కిల్ వద్ద ఉన్న వాల్మీకి కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి వాల్మీకి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశమే లక్ష్యంగా మార్చి 24వ తేదీన అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణంలో ఎద్దఎత్తున వాల్మీకి బోయల శంఖారావ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు భారీసంఖ్యలో వాల్మీకి, బోయలు కదలి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా ఎస్టీ జాబితా పునరుద్ధరణను సాధించుకుందామని పిలుపునిచ్చారు. సభ నిర్వహణకు కమిటీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గౌరవ అధ్యక్షులుగా నల్లబోతుల సుదర్శన్ బాబు, అధ్యక్షులుగా పొదల నరసింహులు, ఉపాధ్యక్షులుగా బొగ్గిటి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు అండ్ మీడియా ఇన్‌ఛార్జిగా నాగినేని గోవిందు,వర్కింగ్ ప్రెసిడెంటుగా మేకల విజయ్ మోహన్,ప్రధాన కార్యదర్శిగా మక్కినేని వేణుగోపాల్, కోశాధికారిగా ముత్తరాసి హరికృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గంపల గంగరాజు, కార్యదర్శిగా బొమ్మనపల్లి లక్ష్మన్న, అధికార ప్రతినిధిగా పూలకుంట్ల హరిబాబు, గౌరవసలహా దారులుగా చిప్పిలి చెంద్రాయప్ప, ప్రచార కార్యదర్శిగా మారా కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శిగా చెన్నం వెంకటరమణ,కార్యవర్గ సభ్యులుగా తలారి కృష్ణప్ప,సహాయ కార్యదర్శిగా కోట రమణ,సహాయ కార్యదర్శిగా ప్రొద్దుటూరు కమలాకర్,కార్యవర్గ సభ్యులుగా చెన్నం నాగలను నియమించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ ధనలక్ష్మి

హాల్ మార్క్ వస్తువులనే వాడాలి : డిపిఒ

ప్రజాశక్తి - రాయచోటి

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్ మార్క్ ఉండే వస్తువులను మాత్రమే గ్రామపంచాయతీలలో కొనుగోలు చేయాలని డిపిఒ ధనలక్ష్మి జిల్లా ప్రజలకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఉదయం. బి.కొత్తకోట, గాలివీడు, చిన్నమండెం, చిట్వేలి, మధ్యాహ్నం కలికిరి, కలకడ, కె.వి పల్లి, గుర్రంకొండ మండలాలకు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఐఎస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీలో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంటు, స్టీలు, వ్యవసాయ పనిముట్లు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్, పివిసి పైప్స్, మాస్కులు, గ్యాస్ స్టవ్, ప్రెజర్ కుక్కర్ తదితర వస్తువులకు తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్ మార్క్ ఉంటేనే కొనుగోలు చేయాలని సూచించారు. వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ తదితర ముఖ్యమైన అంశాలను బిఐఎస్ కేర్ మొబైల్ యాప్ ద్వారా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్‌డి రీస్సోర్స్ పర్సన్లు, రాజంపేట, మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'మిట్స్'లో ఇంజినీర్లకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్‌లో ప్రపంచ ఇంజినీరింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించినట్లు ప్రిన్సిపల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరతమాత ముద్దు బిడ్డ, ఎన్నో ప్రాజెక్టుల రూపశిల్పి అయిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతి ఇంజినీర్‌ను ఈ సంద ర్భంగా సత్కరించారు. ఇంజినీరింగ్, విద్యా రంగంలో మోక్షగుండం సహకారం గణనీయమైనది. ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గొప్ప ఇంజినీర్‌గా ఆయన పరిగణించబడతారని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ రంగంలో నూతన పరిశోధనలు దేశ అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని, విద్యార్థులు అల్లాంటి పరిశోధనలు చేయాలన్నారు. మల్టీ డిసిప్లినరీ పరిశోధనలపై ప్రతి ఒక్కరు దృష్టిపెట్టాలన్నారు. సహజవనరుల వినియోగం, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టచ్ స్టోన్ వారు పని-భద్రత, ప్రమాద నివారణ చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎఐటిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని శాంతిశ్రీ ప్రథమ బహుమతి, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నాగ హర్షిత ద్వితీయ బహుమతి, సిఎస్ఇ మొదటి సంవత్సరం విద్యార్థిని యస్విత తృతీయ బహు మతి సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి నారాయణ తెలిపారు. విజేత లకు కళాశాల వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ భద్రతా నియమాలను పాటిం చాలన్నారు. విధులలో ప్రమాద నివారణ చర్యలను తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టచ్ స్టోన్ ఇన్‌ఛార్జి విజయ్ కుమార్, హెచ్అండ్ఎస్ హెచ్ఒడి డాక్టర్ బి.బాలనాగేంద్రప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని జ్ఞాన దీప్తి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మమ్మ అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో వేదిక్ మాథ్స్, అబాకస్ జోనల్ లెవెల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఆదివారం కడపలో నిర్వహించిన ఈ జోనల్ లెవెల్ పోటీల్లో దాదాపు 40 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అందులో జ్ఞాన దీప్తి పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఈ పోటీల్లో నిలవగా అందులో అబాకస్ లో మూడవ తరగతి మహమ్మద్ అబ్దుల్లా, మోక్షిత, నాలుగవ తరగతి మాన్వి పద్మజా, ఐదవ తరగతి హరిక రెడ్డి, సాయి మాధవ్, గీతశ్రీ, మొదటి బహుమతి గెలుపొందారు. వేదిక్ మాథ్స్ లో ఏడవ తరగతి చరిత మొదటి బహుమతి, ఎనిమిదవ తరగతి సుమిత్ర రెండవ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు మంచి క్రమ శిక్షణ కలిగి అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే వారు ఉన్నత స్థాయికి చేరు కుంటారని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.పద్మావతి, విజయ్ కుమార్, లావణ్య పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఏపి ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 31వ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 21వ ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదర్శ పాఠశాలలోనే ఐదవ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మోడల్ స్కూల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత బోధనను అందిస్తున్నట్లు తెలియజేశారు. ఓసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.75 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించి www.cse.ap.gov.in లేదా apms.apcfss.in వెబ్‌సైట్‌లో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఆబ్జెక్టివ్ విధానంలోని ప్రవేశ పరీక్ష లో ఓసి, బిసి అభ్యర్థులకు 35 మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కనీసం 30 మార్కులు సాధించాలన్నారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలోని రెడ్డివారిపల్లె ఆదర్శపాఠశాల (మోడల్ స్కూల్)లో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈనెల 31వ తేదీలోపు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఓసీ, బీసి విద్యార్థులు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.75లు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21వ తేదిన నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం, ఫోన్ నంబర్ 9490730673ను సంప్రదించాలని అన్నారు.

చంద్రబాబుతో భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి అధ్యక్షులు చంద్రబాబుతో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని టిడిపి మహిళానాయకులు రేవతి పేర్కొన్నారు. సోమవారం పట్టణం లోని జగదంపల్లి,వెంకటేశ్వరపురం, సూర్య నగర్ తదితర ప్రాంతాలలో ఇంటిం టికి వెళ్లి టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాక యువకులు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పోవాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ మెహతాజ్ బేగం, బాలు, ఇందిరమ్మ పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థిగా శంకర్‌యాదవ్‌నే ప్రకటించాలి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

తంబళ్లపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా శంకర్‌యాదవ్‌నే ప్రకటించాలని మండల కన్వీనర్ జిల్లా వెంకటరమణ ఆధ్వర్యంలోఆయన అను చరులు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ ఐదేళ్లుగా పార్టీ ని తన భుజాలపైన మోసిన నాయకుడు శంకర్‌యాదవ్ అన్నారు. కష్టాలకు, నష్టాలకు ఎదురు నిలిచి కేడర్‌ను కాపాడు కుంటూ నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు బాటలు వేశారని అన్నారు. బలమైన నాయకుడిగా ఉన్న ఆయనకు టికెట్ కేటాయించకుండా గుర్తింపు లేని వ్యక్తికి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నిర్ణయాన్ని మార్చుకొని బలమైన బిసి నాయకుడిగా ఉన్న శంకర్ యాదవ్‌కే టికెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు నటరాజ్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు నార శ్రీనివాసులు, యూనిట్ ఇంఛార్జులు రఘునాథ్ యాదవ్, ఎల్లప్ప శ్రీనివాసులు, మధు యాదవ్, ప్రదీప్, మీడియా కో-ఆర్డినేటర్ మైనారిటీ శ్రీనివాసులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రమేష్, రఫీ, రవినాయక్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-చిన్నమండెం

ఈనెల 6 నుంచి మండలంలోని కలిబండ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాలేటమ్మ ఆలయం వద్ద నుంచి ఉదయం 9.30 గంటలకు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో ప్రచా రానికి వెళుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర సంక్షేమం కోసం చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమని అన్నారు. టిడిపి, జనసేన కూటమిని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని వివిధ పంచాయతీల నుంచి వచ్చిన రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ పత్తూరు సాయికి షోర్‌రెడ్డి స్థానిక తహ శీల్దార్ శేషగిరి రావును కోరారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ స్పందనలో అర్జీలు సమర్పించిన రైతుల సమస్యలను పరిష్కరించి రైతుల భూముల ఆన్‌లైన్ నమ స్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులను కార్యాలయాలచుట్టూ తిప్పుకోకుండా సంబంధిత అధికారులు వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలపై వెంటనే పరిష్కరించడం జరుగుతుందని స్పందనలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం లో సర్పంచ్ మద్దు రూపేష్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపిటిసి దుర్గాప్రసాద్, సర్పంచ్ నరేంద్రవర్మ, దశరథరాజు, ఆరవ రామమోహన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన టిడిపి వర్గీయులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు నియోజకవర్గంలో టిడిపి నుంచి వైసిపిలోకి వలసలు జోరందుకున్నాయి. సోమవారం కెవి పల్లి మండలం తుమ్మలపల్లి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో పలు కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు వావు చూసి బలుపును భావిస్తున్నారని అన్నారు. ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులైన ప్రజలు ప్రతిపక్ష పార్టీల నుంచి వైకాపాలోకి చేరడం చూసి జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీలేరు కె.వి పల్లి మండలాల నాయకులు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్ రెడ్డి, ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, మండల యువ నాయకుడు గజ్జల శివ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు : 'కొరముట్ల'

ప్రజాశక్తి-పెనగలూరు

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన వారందరికీ ఇంటిపట్టాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వైస్ ఎంపిపి కొండారు విజయరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై ఇంటి పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ పేద సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ భేదం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు పట్టాలు మంజూరు చేస్తున్నారని అన్నారు. సీఎం ప్రజలందరికీ సంక్షేమం విద్యాభివృద్ధి, ఆరోగ్యంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించారని అన్నారు. ఇంటి పట్టాల ద్వారా లబ్ధి పొందడమే కాకుండా ఇంటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి వారికి పూర్తి హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ మంచినీటి వసతి కల్పించి లేఅవుట్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ ఇంద్రాణి, టిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ, హరిప్రసాద్‌రెడ్డి, ఎఒ పద్మభూషణ్ రెడ్డి, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి : డాక్టర్ రమేష్

నిమ్మనపల్లి : ఇంటింటి ప్రచారంలో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో ఐదు సంవత్సరాలలోపు ఉన్న ప్రతి బిడ్డకు పల్స్ పోలియో చుక్కలను వేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. సోమవారం పల్స్ పోలియో రెండోవ రోజు సందర్భంగా మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 26 పల్స్ పోలియో కేంద్రాల పరిధిలో మిగిలి ఉన్న చంటి బిడ్డల గృహాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. రెండవ రోజు కూడా పోలియో కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. మొదటిరోజు మిగిలిన చంటి బిడ్డల గృహాలను రెండవ రోజు స్వయంగా సందర్శించి వారికి పోలియో పై అవగాహన కల్పించి వైద్య ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయించడం జరిగిందన్నారు. మూడవ రోజు కూడా పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 0-5 సంవత్సరాలలోపు ఉన్న ఏ ఒక్క బిడ్డ కూడా పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పిపోకూడదని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంపై పోలియో చుక్కలు వేయించుకొని వారిని గుర్తించడానికి డోర్ టు డోర్ సర్వే నిర్వహించినట్లు వైద్యాధికారి ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. వైద్యాధికారి ఎం. వి.కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో రెండవ రోజు నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ దేవలపల్లి గ్రామంలో మొత్తం గృహములు 213 ఉన్నవి ఈరోజు సర్వే చేసిన 194 గృహాలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి టార్గెట్ 4149 కాగా 3498 సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ సుబ్బరత్నమ్మ, హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, రెడ్డమ్మ ఎంఎల్‌హెచ్‌పిఎస్ లావణ్య, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్‌అహ్మద్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట :'చింతల'

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-గుర్రంకొండ

ప్రజల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింత రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ హరీష్‌రెడ్డి సోమవారం రామాపురం, తరిగొండ, గుర్రంకొండలో సుడిగాలి పర్యటన చేశారు. రామాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె కేంద్రం, హెల్త్‌క్లినిక్‌ల ను రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ హరీష్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె కేంద్రం, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి నూతన శకానికి నాంది పలికారని అన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని కొనియాడారు. అలాంటి ముఖ్యమంత్రిని ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా సిఎం జగన్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్‌వి.రమణ, ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి సిద్ధం కండి : నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-రామసముద్రం

మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్ ఎన్నికలకు వైసిపి శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మినికి గ్రామంలోని గోకుల్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీకి మద్దతుగా మండలంలో పలు చోట్ల కార్యకర్తలుతో మమేకం అవుతున్నారు. నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగుర వేసేందుకు కార్యకర్తలు మరింత కృషి చేసి గెలుపుకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమకుమారి, వైస్ ఎంపిపిలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి, మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లి ఆనంద్, నాయకులు అరికెల జయరాంరెడ్డి, సిహెచ్ ప్రకాష్, ముగవాడి రెడ్డెప్ప , సర్పంచ్ చరణ్, నరసింహులు, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కు మార్‌రెడ్డి, రాధారెడ్డి, శ్రీనివా సులురెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలో గ్రామ సచివాలయంలో ఖాళీగా ఉన్న గ్రామ సచివాలయ పశువైద్య సిబ్బందికి ఉద్యోగ నియమాయక పత్రాలను ఎంపిడిఒ వెంకటరమణయ్య అందించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. భాగంగా సి.గొల్లపల్లి గ్రామ సచివాలయానికి బి.సురేంద్రనాయక్, సిద్ధవరం గ్రామ సచివాలయానికి ఎం.గౌతమి, నత్తి బొబన్న గారిపల్లి గ్రామ సచివాలయానికి బౌముక్త, బంగ్రేవు గ్రామ సచివాలయానికి బి.బాబునాయక్‌కు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ వెంకటేశ్వరరావు, యుఆర్‌డి జనార్ధన్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ నందు సోమవారం విజ్ఞాన శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని కరస్పాండెంట్ బి.చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ 8, 9వ తరగతుల విద్యార్థులకు సంబంధించి పరిజ్ఞానాన్ని గుర్తించేందుకు తమ పాఠశాలలో విజ్ఞానశాస్త్ర ప్రయోగాల ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శన ద్వారా పిల్లలు చాలా ఉత్సాహంగా ఈ ప్రయోగాలు చేస్తున్నారని అన్నారు. ఈ విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల్లో తమ ప్రతి భను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు న్యాయంతుల్లా, సుబ్బారెడ్డి, రెడ్డిరాజశేఖర్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, శ్రీలక్ష్మి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సరస్వతిపల్లి గ్రామం దళితవాడకు చెందిన 30 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు టిడిపి రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు గడికోట భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోవైసిపి నుంచి వచ్చిన వారికి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి టిడిపి అవసరమని అన్నారు. 45 రోజుల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గడికోట అనంతరెడ్డి, డేగల శివయ్య, .చెన్నూరు అన్నయ్య, వెంకటసుబ్బయ్య, బసిరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

చిరుత సంచారంతో భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని శ్రీ వాళీశ్వరస్వామి కొండలో చిరుత సంచారం చేసినట్లు కొండకు సమీపంలోని రైతులు భయాందోళనతో గడుపుతున్నారు. గతవారం నుంచి చిరుత సంచారం కలవరపెడుతుంది. చిరుత రెండు మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుత సంచరిస్తుందని తెలుసుకున్న రైతులు పశువుల, గొర్రెల కాపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఎవరు అందించలేదు. చిరుత సంచారం తెలిసిన ప్రజలు వాళీశ్వరస్వామి కొండకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు.

ఘనంగా రహ్మాతుల్లా ఉరుసు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలో వెలసిన హాజరత్ షా అలీ గంజే షాహిద్ బాబా రహమతుల్లా అలైహి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉరుసు కార్యక్రమానికి కడప గురువు అరిఫుల్లా మహమ్మద్, మహ్మదుల్లా హుస్సేనీ పాల్గొని దర్గాలో గంధం, పాతిహ కార్యక్రమాన్ని నిర్వహించున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉరుసులో ఢిల్లీ, హైదరాబాద్, ముంబై గాయకులచే గొప్ప ఖవ్వాలీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గందంరోజు ప్రముఖ వ్యాపార వేత్త ఏజాజ్ అలీఖాన్ తన తండ్రి షాబాద్ అలీఖాన్ జ్ఞాపకర్థం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మత సారస్యానికి ప్రతీకగా ఉరుసు ఉత్సవాలు జరుగుతాయన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు మదనపల్లి డిఎస్పి ప్రసాద్ రెడ్డి, క్రైని డి.ఎస్.పి ప్రశాంత్ లు తెలిపారు. సోమవారంవారు మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు సాంప్రదాయబద్ధంగా వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అభిషేకాలతో స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మల్లయ్య కొండపై పరిసరాలను పరిశీలించారు. మల్లయ్య కొండ కింద వాహనాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ఏర్పాటు స్థలాలను పరిశీలించి ఆర్‌టిసి బస్సులు నిలిపే స్థలాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకో వాలని ఎస్ఐ శివ కుమార్‌ను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని ఎగవ సుగాలి తాండలో తాగునీటి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి నూతన బోరు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం అధికారులు నూతన బోరు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు, తాండవాసులు హర్షం వ్యక్తం చేశారు.సర్పంచ్ తులసమ్మ, శంకర్ నాయక్ గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి :'ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రైల్వే కోడూరు పట్టణంలోని నూతనంగా నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతులు, సదుపాయాలను కొరముట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వసతులతో కూడిన నూతన ఆస్పత్రి భవ నాలను నిర్మించి మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో పనిచేస్తున్నారని, రోగులపట్ల వైద్యులుగానీ, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ రమేష్, హాస్పిటల్ డైరెక్టర్ రత్తయ్య, రామ కృష్ణయ్య, ఎంపిటిసిలు, రవుఫ్, పుష్పలత, డాక్టర్లు బ్రహ్మకుమారి, శాంతకుమారి, ధనశ్రీ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకున్న 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇటీవల మండల పరిధిలోని సీతారామపురం ఎస్‌సి కాలనీకి చెందిన పెరిమింటి శివయ్య, విజయలక్ష్మి దంపతుల గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నంద్యాల హరి, కోడూరుసాయి, పులి శివరామకృష్ణ, పులిమణి, గద్దె లక్ష్మయ్య, ఆవుల శంకరయ్య, సాయి చేతులమీదుగా బాధితులకు అందించారు.

బాధితుడికి చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

కృత్రిమ కాలు కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండల పరిధిలోని గాదెల గ్రామంలో నివాసమున్న గంగగారి సుబ్బ రాయడు డయాబెటిస్‌తో కాలు తీసేయడంతో కృత్రిమ కాలు కోసం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి బాధి తుడికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. పేదలకు సేవ చేయడం గొప్ప భాగ్యమని తమ చేతనైనంత వరకు పేదలకు సాయం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు చెందిన వారు ఫౌండేషన్ సేవలపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యాక్రమంలో జనార్ధన్, నారపరెడ్డి, రాజారెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవశ్రీధర్, సుబ్రమణ్యం, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

నిమ్మనపల్లి : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. సోమవారం రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వాల్మీకిపురం టిబి యూనిట్ అధికా రులతో కలిసి జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి వ్యాప్తి, నివారణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ క్షయ అనేది బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్, ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావం చేస్తుందన్నారు. క్షయ వ్యాధి దగ్గు, తుమ్మడం, ఉమ్మి వేయడం ద్వారా గాల్లో కలుస్తుందని, తద్వారా ఆరోగ్యవంతమైన వారికి సోకుతుందన్నారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. క్షయ వ్యాధి సోకిన వారిలో అలసట, తలనొప్పి, బరువుతగ్గడం, ఆకలి మందగించడం, శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయండి

రాయచోటి : ఈ నెల 9న నిర్వహించే చలో అమరావతి వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వై రవీంద్ర మాదిగ పేర్కొన్నారు. సోమవారం మాసాపేట మార్కెట్ యార్డ్‌లో వికలాంగుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ చిన్న సుబ్బయ్య, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు (చిన్న)మాదిగలు హాజరై సంయుక్తంగా మాట్లాడుతూ వికలాంగులు మహాగర్జన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురు గ్రౌండ్‌లో నిర్వహించే సభకు జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల, మండల, గ్రామాల్లో ఉన్న విహెచ్‌పిఎస్. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బాలాజీ, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, ఎంఆర్‌పిఎస్ మదనపల్లి నియోజవర్గ ఇన్‌ఛార్జి సొట్ట రెడ్డిశేఖర్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు కొండప్ప, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లి

తల్లి దండ్రులపై దాడికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. డిఎస్‌పి తెలిపిన వివరాల మేరకు..బి. కొత్తకోట మండలం, బయప్పగారిపల్లి పంచాయతీ, గుంతవారిపల్లిలో నివాసమున్న వృద్ధ దంపతులు వెంకటరమణారెడ్డి, లక్షుమ్మలు బ్రతుదెరువు కోసం మదనపల్లికి వచ్చి స్థానిక నీరుగట్టువారిపల్లె అయోధ్యగనర్‌లో నివాసముంటున్నారని తెలిపారు. వీరికి నలుగురు సంతానం కాగా రెండవ కొడుకు శ్రీనివాసులురెడ్డి ఆస్తి పంపకాల విషయమై గత కొంత కాలంగా తల్లి దండ్రులతో గొడవ పడేవాడని తెలిపారు. శనివారం అయోధ్య నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రులనుఆస్తిలో వాటాలు పంచాలని నిలదీసి, మాట మాట పెరిగి తనకు ఆస్తిలో వాటాలు పంచడంలో వివక్ష చూపించారని తల్లిదండ్రులపై విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులని చూడకుండా విచక్షణ కోల్పోయి దాడిచేశారని చెప్పారు. ఘటనపై బాధితుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12 మంది పేకాట రాయుళ్లు..

ప్రజాశక్తి-ములకలచెరువు

పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు సిఐ మధు , ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక కదిరి రోడ్డు సమీపంలో పేకాట ఆడు తున్నట్లు సమాచారం రావడంతో సిఐ మధు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11,200లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఎవరైనా జూదం ఆడుతున్నట్లయితే తమకు సమాచారం అందించాలని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి..

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాచవేటివారిపల్లి పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన దాసప్ప కుమారుడు గుడ్ల శ్రీనివాసులు మదనపల్లి వద్ద ఆంధ్ర మద్యం కొని అక్రమంగా మద్యం తీసుకొచ్చి దిగువమాచిరెడ్డిగారిపల్లి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాచవేటివారి పల్లి గ్రామం దిగువమాచిరెడ్డిగారి పల్లి సమీపంలో ఓల్డ్ టింబర్ బ్లూ క్లాసిక్ విస్కీ మద్యం బాటిల్లు తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తుండగా సోమవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకొని అతను వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన అదృశ్యమైన యువతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అదృశ్యమైన యువతి పోలీస్ స్టేషనుకు చేరినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.స్థానిక పట్టణంలోని బైపాస్‌రోడ్డు సమీపంలో నివాసముంటున్న ఒక యువతి ఫిబ్రవరి 10న నోట్‌బుక్స్ తీసుకొని వస్తానని కుటుంబ సభ్యులకు తెలిపి ఇంటి నుంచి వెళ్లి పోయిందని అన్నారు. ఐదు రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తప్పిపోయినట్లు గతనెల 15న పట్టణానికి చెందిన ఒక అబ్బాయి తీసుకొని పోయి ఉంటాడనే అనుమానంతో యువతి తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అఆన్నరు. ఈనెల 2న శనివారం తప్పిపోయిన యువతి పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఒక అబ్బాయి తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, ఇబ్బందులు పెట్టాడని, అతని నుంచి తప్పించుకొని వచ్చానని తెలిపిందన్నారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.